క్లుప్తంగా

భావనారాయణుని భూములు స్వాధీనపరచాలి



సర్వే అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ జూనియర్ అసిస్టెంట్ కుమార్

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయం ఈనాం భూములు సర్వే చేయించి స్వాధీన పరచాలని ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీవీ కుమార్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సర్పవరం పాత పంచాయతీ వద్ద గురువారం రీ సర్వే గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈనాం భూములు 255.81 ఎకరాలు తిమ్మాపురం, సర్పవరంలో ఉండి, దేవస్థానం స్వాధీనంలో లేవని తెలియజేశారు. ఆయా భూములను సర్వే చేయించి స్వాధీనం పరచాలని డీటీ సురేష్ తదితరులను కోరారు.

చిన్నారులకు సంరక్షణ కిట్ల పంపిణీ



చిన్నారులకు సంరక్షణ కిట్లు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కాకినాడ రూరల్: అదానీ ఫౌండేషన్ సుపోషణ్ ప్రాజెక్ట్‌లో భాగంగా జాతీయ శిశు సంరక్షణ వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని 19 గ్రామాలలో మూడేళ్ల లోపు వయసున్న 461 మంది పిల్లలకు సంరక్షణ కిట్లు పంపిణీ చేశారు. ఈ నెల 15 నుంచి గురువారం వరకు కార్యక్రమాన్ని నిర్వహించి అదాని ఫౌండేషన్ కార్యకర్తలు కిట్లు అందించారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారని ఫౌండేషన్ ప్రతినిధి జనార్దన్ తెలియజేశారు.

సహజ వాయువు- భద్రతపై కళాజాత



బుర్రకథ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కాకినాడ రూరల్: రాజమహేంద్రవరానికి చెందిన గెయిల్ (ఇండియా) లిమిటెడ్ 'సహజ వాయువు-భద్రత'పై బుర్ర కథ ద్వారా ప్రజా అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా కాకినాడ రూరల్ సూర్యారావుపేటలో ఆర్‌కేటీ ఉద్యోగ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీనటరాజ నిలయ చర్మ చిత్ర కళా ప్రదర్శన సంస్థల ఆధ్వర్యంలో ఆర్‌ఓయూ పైప్‌లైన్‌పై గ్రామస్తులకు బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. గెయిల్ సహజ వాయువు పైప్‌లైన్ భద్రత, పైప్‌లైన్ ఆర్‌ఓయూపై చేయాల్సినవి, చేయకూడనివి వివరించారు. బుర్రకథ కళాకారులు కళాకారులు టి.పవన్‌కుమార్, ఎం.రాణి, ఎన్. మల్లిబాబు వారి కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్	మట్కా, కంగువ, మెకానిక్ రాకీ, అమరన్
దేవీ స్క్రీన్స్	మెకానిక్ రాకీ, కంగువ, మందిర, అమరన్
పద్మప్రియ	లక్కీ భాస్కర్
శ్రీప్రియ	జీబ్రా
సిఅండ్‌సి-1	అమరన్,
సిఅండ్‌సి- 2	దేవకీ నందన వాసుదేవ
సూర్య	దేవాకీ నందన వాసుదేవ,
సూర్య2	జీబ్రా
లక్ష్మి	జీబ్రా
సత్యగౌరి	మందిర
తిరుమల	కంగువ



దుర్వాసనకు కారణమవుతున్న వ్యర్థాలు



వంతెన పైకి ప్రమాదకరంగా పెరిగిపోతున్న చెట్ల కొమ్మలు



కాకినాడ నుంచి ఇంద్రపాలెం, సామర్లకోటకు వెళ్లే వంతెన

ఈ పయనం అస్తవ్యస్తం

- గుంతల మయంగా రోడ్లు
- రహదారిపైకి పెరిగిన చెట్ల కొమ్మలు
- రోడ్డు పక్క చెత్తతో దుర్వాసన
- ప్రయాణికులు, వాహన చోదకులకు ఇక్కట్లు



గోతులమయమైన కాకినాడ-ఇంద్రపాలెం రహదారి

కాకినాడ లీగల్: కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఇంద్రపాలెం బ్రిడ్జి, కాకినాడ-సామర్లకోట రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇక్కట్లకు గురవుతున్నారు. కాకినాడ నుంచి ఇంద్రపాలెం వైపు వెళ్లే వంతెన గోతులమయం కావడంతో పాటు, బ్రిడ్జి పక్క నుంచి మొక్కల కొమ్మలు రహదారిపైకి వస్తుండడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతూ అడపాదడపా ప్రమాదాలపాలవుతున్నారు. అలాగే బ్రిడ్జి పక్క రహదారిని అనుకుని చెత్త వేస్తుండడంతో ఆ ప్రాంతం డంప్ యార్డును తలపిస్తూ పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. అంతేకాకుండా దుర్వాసనతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో పశువుల సంచారం కూడా ఎక్కువగా ఉండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఒకొక్కసారి ట్రాఫిక్ నిలిచిపోతోంది. అలాగే కాకినాడ-సామర్లకోట రహదారి పక్కనే ట్రాక్టర్లు, భారీ వాహనాలు నిలిపివేయడంతో వాహన చోదకులు ఇక్కట్లకు గురవుతున్నారు. మరో వైపు రహదారి పక్కనే బొండాలు, ఇతర బిల్డింగ్ రబ్బిస్ వేయడంతో అంతా చెత్తమయమైపోయింది. గతంలో ఇంద్రపాలెం వంతెన నుంచి ప్రతాప్‌నగర్ బ్రిడ్జి వరకు రహదారి ఇరువైపులా సుందరంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం అప్పట్లో కమిషనర్, అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గ్రీనరీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. కానీ అనంతర పరిణామాలతో ఆ ప్రతిపాదనలు అక్కడితో నిలిచిపోయి ఈ పరిస్థితి నెలకొంది. అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించి పరిష్కరించాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

గోతులు పూడ్చండి



కాకినాడ-ఇంద్రపాలెం రహదారి గోతులు మయం కావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లు వేయకపోయినా కనీసం మరమ్మతులు చేసి గోతులు పూడ్చాలి. అలాగే రోడ్డు పక్కన ఉండే చెత్తా చెదారాన్ని తొలగించి, రోడ్డుపక్క ఉన్న చెట్ల కొమ్మలు తొలగించాలి.

జీఎస్ఆర్ కృష్ణారావు, స్థానికుడు

రోడ్ల పక్కన డంప్ చేయనివ్వకండి



రోడ్ల పక్కన బిల్డింగ్ రబ్బిస్‌తో పాటు, స్థానికంగా సేకరించే చెత్త వేయడంతో ఆయా ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఈ ప్రాంతాల్లో కొబ్బరి బొండాల వ్యర్థాలు వేయడంతో వాటి వల్ల డెంగీ, మలేరియా తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. రోడ్ల పక్కనున్న వ్యర్థాలతో భరించలేని దుర్వాసన వస్తోంది. వాటన్నింటిని శుభ్రం చేయాలి.

ఎస్‌వీ వెంకటరమణ, స్థానికుడు

సర్ రామన్‌కు ఘన నివాళి



సీవీ రామన్‌కు నివాళులర్పిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ నోబుల్ బహుమతి పొందిన గొప్ప వ్యక్తి అని విశ్రాంత ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రామన్ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి రామన్ విజ్ఞాన శాస్త్ర విషయాలపై అమితమైన ఆసక్తిని ప్రదర్శించేవారని అన్నారు. శబ్ద శాస్త్రం నుంచి తన పరిశోధనలను కాంతి శాస్త్రం వైపు మళ్లించారని అన్నారు. రామన్ ఎఫెక్ట్ అంటే పారదర్శకంగా ఉన్న ఘన, ద్రవ, వాయు మాధ్యమానికి కాంతిని ప్రసరించేటప్పుడు అది తన స్వభావాన్ని మార్చుకుంటుందని నిరూపించారని, బ్రిటిష్ ప్రభుత్వం 'నైట్ హుడ్' బిరుదుతో సత్కరించగా భారత ప్రభుత్వం 'భారత రత్న' పురస్కారాన్ని అందించిందని అన్నారు. ఆయన జన్మదినోత్సవాన్ని జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించిందని అన్నారు. 1970 నవంబర్ 21న ఆయన కాలం చేశారని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

బాగున్న రోడ్డుపై మళ్లీ మళ్లీ..



గతంలో ఉన్న సిమెంట్ రోడ్డు

కాకినాడ రూరల్: మండలంలో సర్పవరంలో అధికారుల పర్యవేక్షణ లోపంతో నేతల సిఫార్సుతో బాగున్న రహదారిపైనే మళ్లీ రహదారి నిర్మిస్తున్నారు. గ్రామంలో పూల మార్కెట్ నుంచి పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు వెళ్లే మార్గంలో పక్క రోడ్డు సిమెంట్ రోడ్డుగా ఉంది. దీనికి అక్కడక్కడ బీటలు వారాయని కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. బాగున్న సిమెంట్ రోడ్డుపై మరో సారి సిమెంట్ రోడ్డు నిర్మిస్తుండడంతో గ్రామస్తులు ముక్కున వేలు వేసుకుంటున్నారు. కేవలం కొన్ని ఇళ్ల వారి లబ్ధి కోసం సుమారు రూ.4.5 లక్షలతో గురువారం రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామంలో చాలా ప్రాంతాల్లో రోడ్లు లేవు. ఆయా ప్రాంతాల్లో రహదారులు నిర్మించాల్సింది పోయి ఇలా నిధులు వ్యయం చేయడం విమర్శలకు తావిస్తోంది.



అదే రహదారిపై సాగుతున్న నిర్మాణ పనులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: స్థానిక అన్నమ్మఘాటి విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ తారకరామనగర్ ఫీడర్ పరిధిలో వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కాకినాడ డివిజన్ ఈఈ ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తారకరామనగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్లపై పడిన చెట్టు కొమ్మలను తొలగించడం, విద్యుత్ మరమ్మతులు చేయనున్నట్టు ఆయన తెలిపారు. తారకరామనగర్, ప్రసాదరావునగర్, మణికంఠ నగర్, సత్యదేవనగర్, కొవ్వూరు రోడ్, నాగరాజుపేట, పరదేశమ్మపేట, పురంవారి వీధి, రిక్షాలపేట, పప్పులమిల్లు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. వినియోగదారులందరు సహకరించవలసినదిగా ఆయన కోరారు.

బలరామ అవతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: రజత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి బలరాముని అవతారంలో దర్శనమిచ్చారు. స్వామి వారికి ఉదయం అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రీ సర్వే అభ్యంతరాలపై సత్వర చర్యలు



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

- అధికారులకు ఆర్డీఓ మల్లిబాబు ఆదేశం

కాకినాడ సిటీ: రెవెన్యూ అంశాల్లో రీ సర్వేకు సంబంధించి గ్రామ సభలు నిర్వహించిన నేపథ్యంలో వచ్చిన రీ సర్వే అభ్యంతర దరఖాస్తులపై నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సాతులూరి మల్లిబాబు తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం కాకినాడ రెవెన్యూ డివిజనల్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాలు, తెగల కేసులకు సంబంధించి ధ్రువపత్రం మంజూరు, ప్రభుత్వ సహా ప్రతిపాదనలు తక్షణం పంపించాలన్నారు. హిట్ అండ్ రన్ రోడ్డు ప్రమాద కేసులలో మరణించిన బాధిత కుటుంబాలకు సత్వర ఆర్థిక సహాయ అందించే ప్రతిపాదనలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, పీజీఆర్ఎస్ పిటిషన్లపై సమగ్ర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో పరిపాలనాధికారి జీఆర్ ఠాగూర్, తహసీల్దార్లు త్రినాథరావు, సీతాపతి, జితేంద్ర, గోపాలకృష్ణ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

కరప: ఇటీవలి కాలంలో సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ టి.సునీత పేర్కొన్నారు. మండలం పెనుగుదురులోని సంధ్య ఫిజియోథెరపీ కళాశాలలో గురువారం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయో అవగాహన కల్పించుకుని, మోసపోకుండా ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలకు పాల్పడుతూ అమాయకులను టార్గెట్ చేస్తున్నారన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి కానీ, తెలియని నంబర్ల నుంచి కానీ ఫోన్ కాల్స్ వస్తే మాట్లాడకపోవడమే మంచిదన్నారు. విదేశీ కోడ్‌లతో వచ్చే మొబైల్స్ కాల్స్ లిఫ్ట్ చేయకపోవడమే ఉత్తమని, ప్రధానంగా ప్లస్ 92 కోడ్‌తో వచ్చే ఫోన్లకు స్పందించవద్దని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ అంటూ కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపి, డిజిటల్ అరెస్ట్ అంటూ ఏమీలేదన్నారు. ఏమైనా అనుమానం వచ్చినా, బెదిరింపులు వచ్చినా వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ కేటుగాళ్ల మాయమాటలకు పడి ఎవరైనా సొమ్ములు పోగొట్టుకుంటే వెంటనే 1930కి ఫోన్‌చేసి, ఫిర్యాదు చేయాలన్నారు. కేవైసీ అప్‌డేట్, జాబ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్, స్టాక్ అండ్ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ఎక్కువగా సైబర్ మోసాలు జరుగుతున్నాయని అవి ఎలాజరుగుతున్నాయో వివరించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఐ అవగాహన కల్పించారు. సైబర్ మోసాల గురించి తల్లిదండ్రులకు, తెలిసిన బంధువులు, స్నేహితులకు వివరించి, అవగాహన కల్పించాలని విద్యార్థులకు ఆమె సూచించారు. ఏఎస్ఐ వి.సూరిబాబు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సునీత



నిత్యావసర సరకులు పంపిణీ చేసిన విజన్ చేయూత సభ్యులు

నిత్యావసరాల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో అడబాల ట్రస్టు కార్యాలయంలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరకుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల వారిని ఆదుకోవాలనే దృక్పథంతో చేపట్టిన ఈ పంపిణీ అభినందనీయమని సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, అడబాల రత్నప్రసాద్, శ్రీవాణి, రాజా, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ మున్సిపల్ అధికారులు

కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే రైళ్లు

ట్రైన్ నం.	స్టేషన్	గమ్య స్థానం	వెళ్లే సమయం	వచ్చే సమయం
17258	కాకినాడ పోర్టు	విజయవాడ (డైలీ మెము)	04.20	23.08
17267	కాకినాడ పోర్టు	విశాఖపట్నం (డైలీ మెము)	04.45	21.28
12755	కాకినాడ పోర్టు	భావనగర్ (భావనగర్)గురు	05.50	16.48
17206	కాకినాడ పోర్టు	సాయినగర్ (షిర్డీ) సోమ, బుధ, శని	06.10	18.55
17221	కాకినాడ పోర్టు	లోకమాన్య తిలక్ (ఎల్‌టీటీ) బుధ, శని	09.10	13.43
17655	కాకినాడ పోర్టు	పుదుచ్చేరి (సర్కార్) ఆది, బుధ, గురు	14.40	09.10
17644	కాకినాడ టౌన్	చెంగల్‌పట్టు (సర్కార్) సోమ, మంగళ, శుక్ర, శని	14.40	09.10
17250	కాకినాడ టౌన్	తిరుపతి డైలీ	15.15	11.45
17210	కాకినాడ టౌన్	బెంగళూరు (శేషాద్రి) డైలీ	17.25	06.45
12737	కాకినాడ పోర్టు	లింగంపల్లి (గౌతమి) డైలీ	19.20	06.58
07445	కాకినాడ టౌన్	లింగంపల్లి (స్పెషల్)సోమ బుధ, శుక్ర	20.10	07.10

కుక్కలకు పిక్కలకూ పోటీ!

- గెలిచేది శునకమేనని తెలిసినా పోటీ పడక తప్పని పరిస్థితి ప్రజలది
- నిత్యం ఐదు నుంచి 10 వరకు కేసులు
- గుంపులుగా చేసే దండయాత్రకు అడ్డంగా దొరికిపోతున్న పరిస్థితి

కరప: గ్రామీణుల జీవనం ఎలా ఉందంటే కుక్కలకూ పిక్కలకూ పోటీ అన్నట్టుంది. చివరకు కుక్కే గెలుస్తుందని తెలిసినా పిక్క బలం చూపించక తప్పని పరిస్థితి. అయితే కుక్కకు కాటుకు దొరికిపోవడమో.. లేదా పరుగు లంఘించి అదుపుతప్పి పడిపోయి గాయాల పాలవడమో.. ఎలాగైనా గాయపడడం మాత్రం గ్యారెంటీ. అది పాదచారైనా.. వాహన చోదకుడైనా.. ఎవరైనా కుక్కల దండయాత్రకు దాసోహమనక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది. గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకోని పంచాయతీ అధికారుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గడప దాటి బయటకు వెళ్లిన వారు కుక్కలబారిన పడకుండా క్షేమంగా ఇంటికి వస్తారన్న గ్యారంటీ లేని పరిస్థితి నెలకొంది. పగలు, రాత్రి తేడా లేకుండా పాదచారులను, ద్విచక్రవాహన చోదకులను వెంటబడి తరుముతూ గాయపరుస్తున్నాయి. కోళ్లు, మేకలు, పశువులు వేటినీ వదలడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో రోజుకు 5 నుంచి 10 వరకు కుక్కల దాడి ఘటనలు జరుగుతున్నాయంటే అతిశయోక్తి కాదు. మండలంలోని కరప, వేళంగి పీహెచ్‌సీలలో గత యేడాది కాలంలో 500 వరకు కేసులు నమోదయ్యాయి. ఎక్కడ మీదపడి కరుస్తాయోనని బయటకు వెళ్లాలంటే మహిళలు, వృద్ధులు బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల సంతతి విపరీతంగా పెరిగిపోవడంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా గుంపులు, గుంపులుగా తిరుగాడుతూ ఒంటరిగా వెళ్లినవారిపై దాడిచేస్తున్నాయి. పొలాల్లో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగాడుతూ లేగదూడలను, పాడి పశువులను దాడిచేసి గాయపరుస్తున్నాయని రైతులు తెలిపారు. కరప, పేపకాయలపాలెం, వేళంగి, యండమూరు, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి, వలసపాకల, నడకుదురు తదితర గ్రామాల్లో గత నాలుగైదు నెలల కాలంలో 60 మందిని కుక్కలు కరవడంతో చికిత్స పొందుతున్నారు. ఈ నెలలో మేడిశెట్టి చంద్రశేఖర్, కొత్తపల్లి విజయ్‌కుమార్, నున్న సూర్యప్రకాష్, చత్ర సౌజన్య తొమ్మిదేళ్ల చిన్నారులు చత్ర సౌజన్య, సిద్ధా రుషిక కుక్కకాట్లకు గురయ్యారు. మండల పరిధిలో కరప, వేళంగి పీహెచ్‌సీలు ఉండగా సరాసరిన నెలకు 60 నుంచి 70 కేసులు వస్తున్నట్టు వైద్యాధికారులు డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్, డాక్టర్ ఎంకే సౌజన్య తెలిపారు.



కరప మెయిన్ రోడ్డుపై తిష్ట వేసిన కుక్కలు

కుక్కల నియంత్రణకు చర్యలు



గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. కుక్కల సంతతి పెరగకుండా పశువైద్య సిబ్బంది సహకారంతో యాంటీ రేబిస్ ఇంజెక్షన్లు, స్టెరిలైజేషన్ ఆపరేషన్లు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. డాగ్ క్యాచర్స్ అందుబాటులో లేక ఇబ్బంది కరంగా ఉంటోంది. మండలానికి ఒక జట్టును ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. పంచాయతీ కార్యదర్శులతో చర్చించి కుక్కలను అదుపు చేసేందుకు సూచనలిస్తాం – **ఎస్‌వీ శ్రీనివాసరావు, ఈఓపీఆర్ అండ్ ఆర్డీ, కరప మండలం**

రాత్రి సమయాల్లో భయమేస్తోంది



గ్రామంలో కుక్కలు చాలా ఎక్కువయ్యాయి. రాత్రి సమయంలో బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది, కుక్కలు మీదపడి కరుస్తున్నాయి. మోటార్ సైకిల్‌పై వస్తున్నా తరుముకు వస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కలను పట్టించేందుకు చర్యలు తీసుకోవాలి. – **నక్కా సత్తిబాబు, కరప**

ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి



కరప పీహెచ్‌సీ పరిధిలో కుక్కకాటు కేసులు ఎక్కువగా వస్తున్నాయి. గత నాలుగు నెలల్లో 216 కేసులు వచ్చాయి. ఈ నెలలో ఇంతవరకు 65 కేసులు నమోదయ్యాయి. కుక్కకాటు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఏ సమయంలో వచ్చినా బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నాం.

– **డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, కరప మండల వైద్యాధికారి**